మన రాజధాని
# రక్షణ
నిజం మా బలం
బాపట్ల | గుంటూరు | పల్నాడు
ఆదివారం 5 ఏప్రిల్ 2026 పేజీలు : 4

## మాచర్ల ఘటనపై సీఎం ఆగ్రహం



- ప్రభుత్వ ఉద్యోగినిపై అత్యాచార యత్నం ఘటన
- నిందితుడిని వెంటనే అరెస్టు చేయాలని ఆదేశం
- ప్రత్యేక బృందాలతో పోలీసుల గాలింపు చర్యలు
- మహిళలపై నేరాలకు కఠిన చర్యలే సందేశమని స్పష్టం

పల్నాడు జిల్లా మాచర్లలో ప్రభుత్వ ఉద్యోగినిపై అత్యాచార యత్నం జరిగిన ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్రంగా స్పందించారు. నిం దితుడిని వెంటనే అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశి ంచారు. ఫిర్యాదు అందిన వెంటనే కేసు నమోదు చేసి బాధితురాలిని వైద్య పరీక్షల కోసం ఆస్పత్రి కి తరలించినట్లు అధికారులు తెలిపారు. మాచర్ల రక్షణ న్యూస్

వివరాలు 2లో..







## చెరుకూరులో చెరువు నీళ్లే విషం..?

- డ్రైనేజీ నీళ్లే ట్యాంకుల్లోకి.. 8 వేల మంది ప్రాణాలతో ఆట
- చెరువు మరమ్మత్తులకు ఏటా లక్షలు ఖర్చు.... పనులు మాత్రం శూన్యం
- ఫిల్టర్ బెడ్లు మూడు ఏళ్లుగా పనిచేయవు.. అధికారులు చూడని గ్రామం
- కలెక్టర్ వెంటనే చెరుకూరుకు రావాలి.. గ్రామస్తుల ఆగ్రహం
- కలెక్టర్ సార్ ఇది కరెక్టేనా?

చెరుకూరు పంచాయతీలో మంచినీటి చెరువు పరిస్థితి ఆందోళన కలిగిస్తోంది. చెరువులోకి నేరుగా డ్రైనేజీ నీళ్లు చేరుతున్నప్పటికీ అధికారులు పట్టిం చుకోకపోవడంతో గ్రామస్తులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. చెరువు మర మ్మత్తుల పేరుతో ప్రతి సంవత్సరం లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నట్లు లెక్కలు చూపుతున్నా, ఫిల్టర్ బెడ్లు మూడు సంవత్సరాలుగా పనిచేయడం లేదని స్థాని కులు ఆరోపిస్తున్నారు. ఈ నీటినే సుమారు 8 వేల మంది ప్రజలు విని యోగిస్తున్నారని, దీంతో అనారోగ్య సమస్యలు పెరుగుతున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. పరిస్థితిని పరిశీలించేందుకు జిల్లా కలెక్టర్ చెరుకూరు గ్రామానికి రాకపోవడానికి కారణాలు ఏమిటని నేరుగా ప్రశ్నిస్తున్నారు....

బాపట్ల జిల్లా రక్షణ బ్యూరో



వివరాలు 2లో..

## గుంటూరు అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

-- మంత్రి కందుల దుర్గేష్

- కలెక్టరేట్‌లో బడ్జెట్ అవుట్ రీచ్ ఈవెంట్--2026-27 నిర్వహణ
- నియోజకవర్గాల సమస్యలపై సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలని ఆదేశం
- పర్యాటక అభివృద్ధికి డీపీఆర్‌లతో వస్తే నిధుల కోసం కృషి చేస్తానని హామీ



వివరాలు 2లో..

గుంటూరు జిల్లా సమగ్ర అభివృద్ధి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని జిల్లా ఇంచార్జి మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. శనివారం గుంటూరు కలెక్టరేట్‌లో నిర్వహి ంచిన బడ్జెట్ అవుట్ రీచ్ ఈవెంట్--2026-27లో ఆయన పాల్గొన్నారు. నియోజ కవర్గాల సమస్యలను గుర్తించి శాఖల వారీగా నివేదికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. పర్యాటక అభివృద్ధికి స్పష్టమైన డీపీఆర్‌లతో వస్తే కేంద్రం దృష్టికి తీసుకెళ్లి నిధుల మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గుంటూరు రక్షణ న్యూస్

## అర్జిదారులే అతిథులు

ప్రజల సమస్యలకు తక్షణ స్పందన..ఎమ్మెల్యే నేరుగా వినతుల స్వీకరణ



వివరాలు 2లో..

ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఎమ్మెల్యే నరేంద్ర వర్మ నిర్వహించిన ప్రజాదర్బార్‌లో పింఛన్లు, రేషన్ కార్డులు, మౌలిక సదుపాయాలపై వినతులు స్వీకరించారు బాపట్ల రక్షణ న్యూస్

5- 4- 26 rakshana_praja jyothi Medhak.qxd 4/4/2026 11:39 PM Page 2



# చెరుకూరులో చెరువు నీళ్లే విషం..?

మొదటి పేజీ తరువాయి

**బాపట్ల జిల్లా రక్షణ బ్యూరో**

బాపట్ల జిల్లాలోని చెరుకూరు గ్రామ పంచాయతీలో తాగునీటి చెరువు దుస్థితి తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. గ్రామానికి ప్రధానంగా ఉపయోగపడే ఈ చెరువులోకి నేరుగా డ్రైనేజీ, మలమూత్రాలు చేరుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. చెరువును రక్షించేందుకు ఏర్పాట్లు చేస్తామని గతంలో అధికారులు హామీ ఇచ్చినా, ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని స్థానికులు చెబుతున్నారు.గ్రామంలో సుమారు 8 వేల మంది ప్రజలు ఈ చెరువు నీటినే ట్యాంకుల ద్వారా వినియోగిస్తున్నారు. అయితే చెరువులోని నీరు ట్యాంకులకు వెళ్లే ముందు శుద్ధి చేయాల్సిన ఫిల్టర్ బెడ్లు పూర్తిగా పనికిరాని స్థితిలో ఉన్నాయని గ్రామస్తులు పేర్కొంటున్నారు. గత మూడు సంవత్సరాలుగా ఫిల్టర్ బెడ్లు మార్చకపోవడంతో డ్రైనేజీ కలిసిన నీరే నేరుగా ప్రజలకు సరఫరా అవుతోందని అంటున్నారు. దీంతో గ్రామంలో అతిసార వ్యాధులు పెరుగుతున్నాయన్న ఆందోళన వ్యక్తమవుతోంది.చెరువు కింద సుమారు 42 ఎకరాల భూమి ఉండటంతో ఈ నీటిని వ్యవసాయానికి కూడా వినియోగిస్తున్నారని స్థానికులు తెలిపారు. మరోవైపు తాగునీటి పన్ను పేరుతో ప్రతి ఇంటి నుంచి రూ.800 నుంచి రూ.1000 వరకు వసూలు చేస్తున్నప్పటికీ, చెరువు శుద్ధి పనులపై అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు విమర్శిస్తున్నారు.చెరువు మరమ్మత్తుల పేరుతో ప్రతి సంవత్సరం రూ.25 లక్షల వరకు ఖర్చు చేస్తున్నట్లు రికార్డుల్లో చూపుతున్నారని, కానీ ఆ పనులు ఎక్కడ జరిగాయో గ్రామంలో ఎవరికీ తెలియదని ఆరోపిస్తున్నారు. గతంలో పనిచేసిన పంచాయతీ కార్యదర్శి సుమారు రూ.80 లక్షల వరకు అక్రమాలు చేశారని ఆరోపణలు ఉన్నాయని, ప్రస్తుతం ఉన్న కార్యదర్శి కూడా లక్షల రూపాయలు డ్రా చేసి ఎంబుక్‌లో లెక్కలు వేసినట్లు చూపిస్తున్నారని గ్రామస్తులు చెబుతున్నారు.గ్రామంలో అభివృద్ధి పనులు జరుగుతున్నట్లు రికార్డుల్లో చూపిస్తూ నిధులు మింగేస్తున్నారని, ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో బాత్రూములు నిర్మించినట్లు లెక్కలు చూపించినా వాస్తవానికి పనులు జరగలేదని ఆరోపిస్తున్నారు. పీజీఆర్ఎస్‌కు ఫిర్యాదులు చేసినా స్పందన లేకపోవడంతో గ్రామస్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.జిల్లా కలెక్టర్ ఇప్పటికే విచారణ చేస్తామని చెప్పినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు కనిపించలేదని గ్రామస్తులు అంటు న్నారు. ఇతర గ్రామాలకు అధికారులు పర్యటనలు చేస్తున్నప్పటికీ చెరుకూరు వైపు మాత్రం ఎవరూ రాకపోవడం వెనుక కారణాలేమి టని ప్రశ్నిస్తున్నారు.బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజలు అధికంగా నివసించే ఈ గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్నప్పటికీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారకముందే జిల్లా కలెక్టర్ స్వయంగా చెరుకూరు గ్రామాన్ని సందర్శించి సమస్యలను పరిష్కరించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## మాచర్ల ఘటనపై సీఎం ఆగ్రహం

మొదటి పేజీ తరువాయి

**మాచర్ల రక్షణ న్యూస్**

పల్నాడు జిల్లా మాచర్ల పట్టణంలో ప్రభుత్వ ఉద్యోగినిపై అత్యాచార యత్నం జరిగిన ఘటన రాష్ట్రంలో కలకలం రేపింది. ఈ ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెంటనే స్పందించి నిందితుడిని త్వరితగతిన అరెస్టు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు.అధికారుల వివరాల ప్రకారం పంచాయతీరాజ్ శాఖలో కార్యాలయ సబార్డినేట్‌గా పనిచేస్తున్న ఓ మహిళ ఇంట్లోకి అగంతకుడు చొరబడి అత్యాచార యత్నానికి పాల్పడ్డాడు. బాధితురాలు ప్రతిఘటించడంతో నిందితుడు అక్కడి నుంచి పరారైనట్లు సమాచారం. ఈ ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.ఫిర్యాదు అందిన వెంటనే బాధితురాలిని వైద్య పరీక్షల కోసం గుంటూరు ప్రభుత్వ సాధారణ ఆస్పత్రికి తరలించినట్లు అధికారులు తెలిపారు. ఘటనపై విచారణ కొనసాగుతోందని పేర్కొన్నారు.ఈ ఘటనను అత్యంత గంభీరంగా తీసుకున్న ముఖ్యమంత్రి పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడి నిందితుడిని వెంటనే పట్టుకోవాలని ఆదేశించారు. మహిళల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని స్పష్టం చేశారు.నిందితుడిని పట్టుకునేందుకు అదనపు ఎస్పీ నేతృత్వంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు పోలీసు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. అనుమానితులుగా భావిస్తున్న కొందరిని ఇప్పటికే అదుపులోకి తీసుకుని విచారణ కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు.మహిళలపై నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నిందితుడిని త్వరగా పట్టుకుని చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టమైన దిశానిర్దేశం ఇచ్చారు.

## గుంటూరు అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

మొదటి పేజీ తరువాయి

**గుంటూరు రక్షణ న్యూస్**

గుంటూరు జిల్లా సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని జిల్లా ఇంచార్జి మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. శనివారం గుంటూరు జిల్లా కలెక్టరేట్‌లోని శంకరన్ కమిటీ హాల్‌లో "బడ్జెట్ అవుట్ రీచ్ ఈవెంట్--2026-27" కార్యక్రమాన్ని ఆయన అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్ ద్వారా కేటాయించిన నిధులు ప్రతి జిల్లా, ప్రతి నియోజకవర్గ స్థాయి వరకు సమర్థంగా చేరేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంకల్పమని తెలిపారు. స్థానిక అవసరాలు, ప్రజల ప్రాధాన్యతలను దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయాలని సూచించారు.ఈనెల 11వ తేదీన ముఖ్యమంత్రి అధ్యక్షతన జరగనున్న జిల్లా సమీక్షా సమావేశానికి ముందుగా అన్ని శాఖల అధికారులు తమ పరిధిలోని ఆర్థిక, ఆర్థికేతర సమస్యలపై పూర్తి వివరాలతో నివేదికలు సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించారు. మొదటగా ఈ సమావేశం 7వ తేదీన జరగాల్సి ఉండగా 11వ తేదీకి వాయిదా పడిందని పేర్కొన్నారు.జిల్లాలోని పర్యాటకంగా అభివృద్ధి చేయదగిన ప్రాంతాలపై ప్రజా ప్రతినిధులు స్పష్టమైన డీపీఆర్‌లతో ముందుకు వస్తే వాటిని కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి నిధుల మంజూరుకు కృషి చేస్తానని మంత్రి దుర్గేష్ హామీ ఇచ్చారు. జిల్లా అభివృద్ధికి అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు ధూళిపాళ్ల నరేంద్ర, గల్లా మాధవి, నజీర్ అహ్మద్, రామాంజనేయులు, తెనాలి శ్రావణ్ కుమార్, జిల్లా కలెక్టర్ సాయికాంత్ వర్మ, పోలీసు సూపరింటెండెంట్ వకుల్ జిందాల్, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, నగర కమిషనర్ మయూర్ అశోక్, డీఆర్వో ఎస్.ఎస్.కె. ఖాజావలి తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## అర్జిదారులే అతిథులు

మొదటి పేజీ తరువాయి

**బాపట్ల రక్షణ న్యూస్**

బాపట్ల మున్సిపల్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన 'ప్రజా దర్బార్' కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారం కల్పించేందుకు ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు చర్యలు చేపట్టారు. నియోజకవర్గ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వెంటనే స్పందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. సాధారణంగా ప్రతి శుక్రవారం జరిగే ఈ కార్యక్రమం గుడ్ ఫ్రైడే సందర్భంగా సెలవు కావడంతో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా శనివారం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించారు.పింఛన్లు, రేషన్ కార్డులు, మౌలిక సదుపాయాలు తదితర అంశాలపై వచ్చిన అర్జీలను స్వీకరించిన ఎమ్మెల్యే, సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలకు ఎప్పుడైనా అందుబాటులో ఉంటానని, ప్రజా సమస్యల పరిష్కారమే తన తొలి ప్రాధాన్యత అని ఎమ్మెల్యే నరేంద్ర వర్మ స్పష్టం చేశారు.

## ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్ కు ఘన స్వాగతం



**బాపట్ల రక్షణ న్యూస్**

అమరావతిని ఆంధ్రప్రదేశ్ ఏకైక శాశ్వత రాజధానిగా గుర్తించే ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం సవరణ బిల్లు ఆమోదం నేపథ్యంలో బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్కు బాపట్ల పట్టణంలో ఘన స్వాగతం లభించింది. ఢిల్లీ నుంచి తొలిసారిగా బాపట్లకు చేరుకున్న ఆయనకు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు.పట్టణ పొలిమేరల వద్దే తరలివచ్చిన పార్టీ నాయకులు సాదు నాగేశ్వరావు, భోగిరి పృథ్వీరాజ్, గవిని మణికుమార్, నక్క ప్రకాష్ తదితరులు ఎంపీ పూలమాలలు వేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా భోగిరి పృథ్వీరాజ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. అమరావతిని రాష్ట్ర ఏకైక రాజధానిగా గుర్తించడంలో ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్ కీలక పాత్ర పోషించారని నాయకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

5- 4- 26 rakshana_praja jyothi Medhak.qxd 4/4/2026 11:39 PM Page 3



# మాచర్లలో ఆరోపణల జోరు

**మాచర్ల రక్షణ న్యూస్**

పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గంలో రాజకీయాలు మళ్లీ వేడెక్కాయి. వెల్దుర్తి టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ప్రస్తుత ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పై ఘాటు విమర్శలు చేశారు.గత ఐదు సంవత్సరాల్లో తమ కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టారని, కార్యాలయాలు, ఇళ్లు, వాహనాలు ధ్వంసం చేశారని ఆరోపించారు. “మా ప్రభుత్వం తప్పుడు కేసులు పెట్టదు, చట్టబద్ధంగా మాత్రమే చర్యలు తీసుకుంటాం” అని స్పష్టం చేశారు.అదేవిధంగా కండ్లకుంట--కొత్త పుల్లారెడ్డిగూడెం గ్రామాల మధ్య అక్రమంగా చెరువు ఏర్పాటు చేసి ప్రభుత్వ కరెంటుతో నీళ్లు అమ్ముకున్నారని ఆరోపించారు. భూకబ్జాలు, బినామీల వివరాలు త్వరలో బయటపెడతామని హెచ్చరించారు.



మాచర్ల అభివృద్ధిని చూసి ఓర్వలేక ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్న ఎమ్మెల్యే, అక్రమ చర్యలు ఆపకపోతే చట్టపరమైన చర్యలు తప్పవని అన్నారు. వరిక పుడిసెల ప్రాజెక్ట్ పనులు త్వరలోప్రారంభమవుతాయని, మెగా టెక్స్టైల్ పార్క్ కోసం భూ సర్వే జరుగుతోందని, 132 కెవి సబ్‌స్టేషన్ నిర్మాణం చేపడతామని తెలిపారు.

# బాధితులకు భరోసా



**పొన్నూరు రక్షణ న్యూస్**

పొన్నూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబాలకు ముఖ్యమంత్రి ఆర్థిక సహాయ నిధి ద్వారా మొత్తం రూ.7 లక్షల ఎక్స్‌గ్రేషియా చెక్కులను పంపిణీ చేశారు.వడ్డీముక్కల గ్రామానికి చెందిన షేక్ బాజీ కుటుంబానికి రూ.2 లక్షలు, పెదపాలెం గ్రామానికి చెందిన ఉలిచి కోటేశ్వరరావు కుటుంబానికి రూ.2 లక్షలు, పొన్నూరు 4వ వార్డు నివాసి షేక్ కుద్దుస్ కుటుంబానికి రూ.1 లక్ష, 29వ వార్డు మాజీ కౌన్సిలర్ షేక్ మస్తాన్ వలి కుటుంబానికి రూ.2 లక్షల చొప్పున చెక్కులు అందజేశారు.ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే, పార్టీ కార్యకర్తల కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

**-- ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు కు వినతి**

**ఇంకొల్లు రక్షణ న్యూస్**

ఇంకొల్లు, మార్టూరు మండలాలకు చెందిన ప్రభుత్వ పెన్షనర్లు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావును కలిసి వేరువేరుగా వినతిపత్రాలు అందజేశారు. పెన్షనర్ల సంక్షేమానికి సంబంధించిన పలు కీలక అంశాలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు.ఈ సందర్భంగా పెన్షనర్లు మాట్లాడుతూ గతంలో అమలులో ఉన్న పలు సౌకర్యాలను తిరిగి అమలు చేయాలని కోరారు. ముఖ్యంగా అదనపు పెన్షన్ (అడిషనల్ క్వాంటమ్) శాతాలను మునుపటి విధంగా కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. 70, 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న వారికి ఇచ్చే శాతాలను తగ్గించడం వల్ల తమకు ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని వివరించారు.అలాగే పెన్షనర్ లేదా వారి జీవిత భాగస్వామి మరణించినప్పుడు అందించే ఫ్యూనరల్ ఛార్జీలను పెంచాలని కోరారు. ప్రస్తుతం అందిస్తున్న సహాయం ఖర్చులకు సరిపోవడం లేదని, మునుపటి విధంగా ఒక నెల పెన్షన్ మొత్తాన్ని అందించాలని విజ్ఞప్తి చేశారు.కమ్యూటేషన్ రీస్టోరేషన్ కాలాన్ని కూడా తగ్గించాలని





సూచించారు. ప్రస్తుత విధానంలో పెన్షనర్లకు నష్టం జరుగుతోందని, ఇతర రాష్ట్రాల మాదిరిగా కాలాన్ని తగ్గించాలని కోరారు. అలాగే 12వ పీఆర్‌సీని వెంటనే ఏర్పాటు చేసి మధ్యంతర ఉపశమనం ప్రకటించాలని, ఈహెచ్‌ఎస్ కార్డు ద్వారా క్యాష్‌లెస్ వైద్యం సులభంగా అందేలా చర్యలు తీసుకోవాలని వినతిపత్రాల్లో పేర్కొన్నారు.పెన్షనర్ల సమస్యలను శ్రద్ధగా విన్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ముఖ్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి ఈ అంశాలను తీసుకెళ్తానని తెలిపారు.

# పేదలకు వైద్య భరోసా



**పిట్టలవానిపాలెం రక్షణ న్యూస్**

పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించడంలో ముఖ్యమంత్రి సహాయనిధి (జీవ=ఖీ) కీలక పాత్ర పోషిస్తున్న నేపథ్యంలో, బాపట్ల పార్లమెంట్ అధికార ప్రతినిధి డాక్టర్ గ్లోరి యానెట్ సౌపాటి సేవలు ప్రశంసలు అందుకుంటున్నాయి. పిట్టలవానిపాలెం మండలం సంగుపాలెం గ్రామానికి చెందిన చందోలు యెహోషువ కుమార్తె అనారోగ్యంతో బాధపడుతుండగా ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స చేయించాల్సి వచ్చింది. భారీ ఖర్చులు భరించలేని పరిస్థితిలో ఉన్న ఈ కుటుంబానికి డాక్టర్ గ్లోరి యానెట్ సౌపాటి ముందుకు వచ్చి సహాయ సహకారాలు అందించారు.ఆమె మార్గదర్శకత్వంలో చికిత్స బిల్లులను ముఖ్యమంత్రి సహాయనిధికి పంపించగా, తక్కువ సమయంలోనే జవీ=ఖీ చెక్కు మంజూరు అయింది. ఈ సహాయం కుటుంబానికి పెద్ద ఊరట కలిగించింది.ఈ సందర్భంగా చందోలు యెహోషువ మాట్లాడుతూ, క్లిష్ట సమయంలో వెంటనే స్పందించి సహాయం అందించిన డాక్టర్ గ్లోరి యానెట్ సౌపాటి సేవలను కొనియాడారు. అలాగే ఎమ్మెల్యే నరేంద్ర వర్మ, ముఖ్యమంత్రి మరియు కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.ఇలాంటి సేవా కార్యక్రమాల ద్వారా మరెంతో మంది పేదలకు సహాయం అందించాలని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేశారు

# సచివాలయ సేవలు ప్రజలకు చేరువ కావాలి..

**జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్,**

**భట్టిప్రోలురక్షణ న్యూస్**

:జిల్లాలో గ్రామ స్థాయిలో ప్రజలకు అందుతున్న సేవల నాణ్యతను మెరుగుపరచాలన్న లక్ష్యంతో జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ శనివారంబాపట్ల జిల్లా భట్టిప్రోలు మండలం సూరేపల్లి గ్రామ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా సచివాలయంలో జరుగుతున్న పరిపాలన, పౌర సేవల అమలు తీరు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించారు ప్రజలకు సమయానికి, పారదర్శకంగా సేవలు అందించాల్సిన బాధ్యత సచివాలయ సిబ్బంది పై ఉందని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల వివరాలు ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలని, ప్రతి అభ్యర్థనను నిర్ణీత గడువులో పరిష్కరించాలని ఆదేశించారు.భూ రికార్డుల నిర్వహణ లో ఎలాంటి లోపాలు లేకుండా ఖచ్చితత్వం పాటించాలని అధికారులను దిశానిర్దేశం చేశారు. గ్రామంలో అమలవుతున్న వివిధ సంక్షేమ పథకాలపై ఫీల్డ్ స్థాయిలో సమాచారం సేకరించి, వాటి ప్రభావాన్ని విశ్లేషించాలని అధికారులకు సూచించారు. ప్రజల నుంచి వచ్చే



ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే స్పందించాలని హెచ్చరించారు.తనిఖీ కార్యక్రమంలో జిల్లా భూ రికార్డుల శాఖ ఏడీ సాంబశివరావు, రేపల్లె రెవెన్యూ డివిజనల్ అధికారిణి బి. శ్రీదేవి, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ వెంకటరమణ, ఈడీఎం రాజ్ కుమార్, వీఆర్‌ఓ, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.గ్రామస్థాయిలో పరిపాలనను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ఇలాంటి తనిఖీలు కొనసాగుతాయని కలెక్టర్ స్పష్టం చేశారు.........

5- 4- 26 rakshana_praja jyothi Medhak.qxd 4/4/2026 11:39 PM Page 4



# హోరిజాన్ పబ్లిక్ స్కూల్ తొలి వార్షికోత్సవం ఘనంగా




**వేటపాలెం రక్షణ న్యూస్**

బాపట్ల జిల్లా వేటపాలెం మండలం రామన్నపేట గ్రామంలోని సాయి నగర్‌లో ఉన్న హోరిజాన్ పబ్లిక్ స్కూల్ తొలి వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, చీరాల ఎమ్మెల్యే మద్దలూరి మాలకొండయ్య హాజరయ్యారు.కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా నిర్వహించిన గాంధారి గేమ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ ఆటలో పాల్గొన్న చిన్నారులతో కలిసి ఎమ్మెల్యేలు కూడా సరదాగా పాల్గొని విద్యార్థులను ఉత్సాహపరిచారు.పాఠశాల ఒక సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు, స్థానికులు పెద్దఎత్తున పాల్గొన్నారు. విద్యార్థుల ప్రతిభను అభినందిస్తూ అతిథులు భవిష్యత్తులో పాఠశాల మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు.

# వినుకొండలో అభివృద్ధి పనులు, రెవెన్యూ అంశాలపై జేసీ సంజనా సింహా సమీక్ష



**వినుకొండ రక్షణ న్యూస్**

పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ సంజనా సింహా శనివారం వినుకొండ నియోజకవర్గం పరిధిలోని శావల్యాపురం మండలం కనుమర్లపూడి గ్రామంలో పర్యటించారు. గ్రామంలోని రైల్వే గేట్ నెంబర్ 267 వద్ద నిర్మిస్తున్న రోడ్డు అండర్ బ్రిడ్జ్ పనులను పరిశీలించి, అక్కడ నీరు నిల్వ ఉండకుండా డ్రెయిన్ పైపుల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే ఆర్వోబీని ప్రధాన రహదారితో పూర్తిగా అనుసంధానించేలా రోడ్డు నిర్మించాలని ఆర్ అండ్ బి అధికారులకు సూచించారు. అనంతరం వినుకొండ తహశీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని తహశీల్దార్లు, డిప్యూటీ తహశీల్దార్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పరిష్కారం కాని ఇనాం గ్రామాల సమస్యలు, 22-ఏ తొలగింపు, మ్యుటేషన్స్, హౌస్ సైట్స్, రీ సర్వే, ఐవీఆర్ఎస్, వెబ్‌ల్యాండ్ సమస్యలు, రెవెన్యూ రికార్డుల డిజిటలీకరణ, సుమోటో కేసులు, సాగునీటి పన్ను, పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ వంటి అంశాలపై అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో రైల్వే ఇంజినీర్ శ్రీనివాస రెడ్డి, శావల్యాపురం తహశీల్దార్ అర్జున్ నాయక్, ఎంపీడీఓ పి. సీతారామయ్య, మండల సర్వేయర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఐదు మండలాల తహశీల్దార్లు, డిప్యూటీ తహశీల్దార్లు, సి.ఎస్.డి.టీలు, ఎం.ఎల్.ఓలు సమావేశంలో పాల్గొన్నారు.

# జిల్లా అభివృద్ధికి ప్రతి ఒక్కరు పునరంకితం కావాలి

## కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్




**భట్టిప్రోలు రక్షణ న్యూస్**

బాపట్ల జిల్లా అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరు పునరంకితం కావాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వి పిలుపునిచ్చారు. ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో బాపట్ల జిల్లా ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం స్థానిక ఈటీసీ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిపాలనను ప్రజల వద్దకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నాయని తెలిపారు.ఈ సందర్భంగా బాపట్ల జిల్లా ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీలలో విజేతలైన 12 మంది విద్యార్థులను కలెక్టర్ పతకాలతో సత్కరించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నుంచి కళారత్న హంస పురస్కారం అందుకున్న మోదుకూరుకు చెందిన టి. సీతారామిరెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు. అలాగే బాపట్ల సేవా సేతు కార్యక్రమం కింద యాజలి గ్రామ అభివృద్ధికి కోటి రూపాయల విరాళం అందజేసిన జి. సత్యనారాయణను ప్రశంసించారు.జిల్లా ఏర్పాటుతో పరిపాలన ప్రజలకు మరింత చేరువైందని, ప్రస్తుతం నాలుగేళ్లు పూర్తి చేసుకున్న బాపట్ల జిల్లా అభివృద్ధి బాటలో ముందుకు సాగుతోందని కలెక్టర్ తెలిపారు. 25 మండలాలతో జిల్లాను ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలకు సేవలు మరింత వేగంగా అందుతున్నాయని చెప్పారు. తెలుగు భాషకు ప్రత్యేక ప్రాచుర్యం ఉన్న బాపట్ల జిల్లాలో పనిచేయడం గర్వకారణమని పేర్కొన్నారు.కార్యక్రమంలో ఏపీ మానవ వనరుల అభివృద్ధి సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి, సంచాలకులు, విశ్రాంత ఐఏఎస్ అధికారి చక్రపాణి మాట్లాడుతూ బాపట్ల జిల్లాను పర్యాటక హబ్‌గా అభివృద్ధి చేయడానికి చర్యలు ప్రారంభమయ్యాయని తెలిపారు. కలెక్టర్ వినోద్ కుమార్ చేస్తున్న కృషిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు.ఫోరం ఫర్ బెటర్ బాపట్ల జిల్లా కార్యదర్శి పి.సి. సాయిబాబు మాట్లాడుతూ బాపట్ల జిల్లా చారిత్రాత్మక ప్రాధాన్యం గల ప్రాంతమని తెలిపారు. భట్టిప్రోలు శాసనాలతో తెలుగు లిపి ఆవిర్భావం జరిగిందని, ఆచార్య నాగార్జునుడు వంటి మహానుభావులు ఈ ప్రాంతానికి చెందినవారని వివరించారు. ఈ కార్యక్రమంలో బాపట్ల ఆర్డీఓ పి. గ్లోరియా, ఏపీ హిస్టరీ కాంగ్రెస్ కార్యదర్శి ఎం. శ్రీనివాస్ రెడ్డి, సంఘం నాయకులు గురజాల శ్రీనివాసరావు, జి. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# బాపట్లలో ఘనంగా 'రన్ ఫర్ జీసస్' ర్యాలీ

**బాపట్ల రక్షణ న్యూస్**

గుడ్ ఫ్రైడే, ఈస్టర్ పండుగలను పురస్కరించుకుని బాపట్లలో శనివారం 'రన్ ఫర్ జీసస్' ర్యాలీ ఘనంగా నిర్వహించారు. బాపట్లలోని వివిధ సంఘాల పాస్టర్లు, ఎఫ్.డబ్ల్యూ కోల్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమాన్ని కోల్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవాళి రక్షణ కోసం యేసుక్రీస్తు ఈ లోకంలో జన్మించారని తెలిపారు. ప్రతి ఒక్కరిని సమానంగా చూడాలని, ప్రేమ, కరుణ భావాలతో మెలగాలని, సేవా భావంతో జీవించాలని యేసు బోధించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన నిర్వాహకులు, పాల్గొన్న యువతకు ఆయన అభినందనలు తెలిపారు.సూర్యలంక ఇండెన్ గ్యాస్ గూడెం వద్ద ప్రారంభమైన ఈ ర్యాలీ విజయలక్ష్మిపురం, కొత్తపేట, దగ్గుమల్లి వారిపాలెం, విలియమ్ బూత్ సెంటర్, అంబేద్కర్ సర్కిల్, గడియార స్తంభం సెంటర్, పాత బస్టాండ్, చీల్ రోడ్డు సెంటర్, టీచర్స్ కాలనీ మీదుగా సాగి చివరకు సి.బి.జెడ్ చర్చ్ వద్ద ముగిసింది.ఈ కార్యక్రమంలో పవిత్ర కుమార్, యేసుపాదం, జయపాల్, మాణిభూషణ్, రాహుల్ దేవ్, కిషోర్, దయాకర్ తదితరులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# చెరువులో మృతదేహం లభ్యం

**వేదుళ్లపల్లి రక్షణ న్యూస్**



వెదుళ్ళపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించడం కలకలం రేపింది. స్టువర్టు పురం గ్రామంలోని ఐదవ గ్యాంగ్ వెనుక ఉన్న చెరువులో ఈ ఘటన చోటుచేసుకుంది.స్టువర్టు పురం గ్రామ వీఆర్వో మొగిలి విజయలక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం, మధ్యాహ్నం సుమారు 1 గంటల సమయంలో చెరువులో ఒక మృతదేహం తేలియాడుతున్నట్లు సమాచారం అందింది. వెంటనే అక్కడికి చేరుకుని పరిశీలించగా, సుమారు 40 నుంచి 45 సంవత్సరాల మధ్య వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కనిపించింది.మృతుడు వైలెట్ రంగు టీ షర్ట్, గ్రీన్ రంగు షార్ట్, గళ్ల లుంగీ ధరించి ఉన్నట్లు గుర్తించారు. ఈ మేరకు వెదుళ్ళపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.మృతదేహానికి సంబంధించిన వివరాలు తెలిసిన వారు వెదుళ్ళపల్లి ఎస్‌హెచ్‌ఓను